1st Happy Work Anniversary. 1 Year

షణ్ముఖ

RNI : APTEL / 2023 / 89152

వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

సంపుటి : 1 సంచిక : 333 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 10 మార్చి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 21 October 2024 PAGES : 8 PRICE : 5/-

"ఆఖరి సమరంలో నాటకీయతకు లోటు లేదు! ఉత్కంఠ తప్పలేదు! స్పిన్నర్ల మ్యాజిక్‌తో, రోహిత్ శర్మ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అలవోకగా గెలిచేలా కనిపించిన భారత్.. అనూహ్యంగా చిక్కుల్లో పడింది. ప్రత్యర్థిని 251కే పరిమితం చేసి, ఛేదనలో వికెట్ కోల్పోకుండా సునాయాసంగా వంద దాటేసిన జట్టు ఒక్కసారిగా కుదుపునకు గురైంది. చకచకా మూడు వికెట్లు కోల్పోయిన తరుణాన సింగిల్స్ తీయడమే కష్టంగా మారగా.. శ్రేయస్ ఆపద్బాంధవుడే అయ్యాడు. తీవ్ర ఒత్తిడిలో అక్షర్ చేసిన 29, హార్దిక్ కొట్టిన 18, రాహుల్ అజేయ 34 కూడా అంతే అమూల్యమైనవి. టోర్నీ ఆద్యంతం ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన టీమ్‌ఇండియా.. అజేయంగా కప్పునందుకుంది.

11

సాధించాం!

రసవత్తర ఫైనల్లో కివీస్‌పై విజయం

భారత్‌దే ఛాంపియన్స్ ట్రోఫీ.. చెలరేగిన రోహిత్.. రాణించిన శ్రేయస్

స్పిన్నర్ల విజృంభణ జూ సత్తా చాటిన రోహిత్.. భారత్‌కు - రూ. 19.4 కోట్లు.. న్యూజిలాండ్‌కు - రూ. 9.7 కోట్లు

బీసీలు ఎదగకుండా

అడ్డుకునే కుట్ర

- 42 శాతం రిజర్వేషన్లను ఆదిలోనే అడ్డుకునే ప్రయత్నాలు
- అఖిలభారత పద్మశాలి మహాసభలో సీఎం రేవంత్‌రెడ్డి
- అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి కేంద్రానికి పంపితే మోదీ మెడపై కత్తి పెట్టినట్లే.. బీసీ రిజర్వేషన్లు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది
- మా సర్వే తప్పని ఏవిధంగా చెబుతున్నారో పక్కా ఆధారాలతో రావాలన్నాం.. మా సవాల్ స్వీకరించకుండా బీజేపీ, బీఆర్ఎస్ తప్పించుకుంటున్నాయి

2

అభ్యర్థిత్వం అనూహ్యం

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా విజయశాంతి, అద్దంకి, శంకర్‌నాయక్

- ఎమ్మెల్యే కోటా అభ్యర్థులను ప్రకటించిన అధిష్ఠానం
- ఒక సీటు మిత్రపక్షం సీపీఐకి కేటాయింపు
- అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ సామాజిక న్యాయం
- ఎస్సీ, ఎస్టీతోపాటు మహిళకు సీటు కేటాయింపు
- అనూహ్యంగా తెరపైకి రాములమ్మ పేరు

హైదరాబాద్/న్యూఢిల్లీ/నల్లగొండ, షణ్ముఖ వెలుగు

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3 పార్టీలూ అనూహ్యంగా అభ్యర్థిత్వాలను ప్రకటించాయి! కాంగ్రెస్ తన అభ్యర్థులుగా విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్‌లను ప్రకటించింది! ఇక, ఎప్పటి నుంచో అధ్యక్షా.. అనాలని కోరుకుంటున్న దాసోజు శ్రవణ్‌ను బీఆర్ఎస్ ఎంపిక చేసింది! మిత్రపక్షం సీపీఐకి కాంగ్రెస్ ఇచ్చిన సీటులో నెల్లికంటి సత్యం పేరును ఖరారు చేసింది. ఈసారి విశేషం ఏమిటంటే.. నల్లగొండ జిల్లా జాక్‌పాట్ కొట్టడం! ఆ జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్సీలు కాబోతుండడం..! కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠకు - మిగతా2లో

నేటి నుంచే పార్లమెంటు

- మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు లోక్‌సభ ఆమోదం కోరనున్న అమిత్ షా
- మణిపూర్, వక్ఫ్ బిల్లుపై సర్కారును నిలదీయనున్న ప్రతిపక్షాలు
- నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా సూత్రంపైనా ఆందోళన

2

డీలిమిటేషన్, నిర్బంధ హిందీ అమలుపై

కేంద్రాన్ని నిలదీయాలి

- నియోజవర్గాల పునర్విభజన వల్ల నష్టపోయేదీ తమిళనాడు మాత్రమే కాదు
- బాధిత రాష్ట్రాల ఎంపీలను కలుపుకొని వెళ్లాలి
- డీఎంకే ఎంపీలకు స్టాలిన్ దిశానిర్దేశం

ఈడీ వర్సెస్ సీఐడీ!

- ఆధారాలేవన్న సీఐడీ.. కోర్టుకు చేరిన వ్యవహారం
- ఆధారాలున్నాయి.. కేసు మూసేయవద్దన్న ఈడీ
- సీఐడీ తీరుపై హైదరాబాద్ సీపీ అసహనం
- కేసును మళ్లీ తెరవాలంటూ డీజీపీకి లేఖ

హైదరాబాద్, షణ్ముఖ వెలుగు

ఆ రెండూ నేరస్థుల పాలిట సింహస్వప్నాలుగా పేరొందిన విభాగాలే..! ఒకటి నేరాలపై రాష్ట్రస్థాయిలో అత్యున్నత దర్యాప్తు సంస్థ సీఐడీ అయితే.. రెండోది జాతీయ స్థాయిలో మనీల్యాండరింగ్, విదేశాలతో అక్రమ లావాదేవీలపై దృష్టి సారించే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)..! ఇప్పుడు ఈ రెండు విభాగాల మధ్య ఓ ఆర్థిక నేరానికి సంబంధించి పంచాయితీ మొదలైంది. ఎలాంటి ఆధారాల్లేవని, కేసును మూసివేయాలని సీఐడీ పట్టుబడుతుండగా.. ఆధారాలున్నాయి, సీఐడీ పునరాలోచించుకోవాలంటూ ఈడీ చెబుతోంది. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ కూడా సీఐడీ నిర్ణయాన్ని తప్పుబట్టడం గమనార్హం..! 2010లో ఉమ్మడి ఏపీలో ఫార్మెక్స్ ఇండియా కంపెనీ లిమిటెడ్(ఎఫఐసీఎల్) గ్లోబల్ డిపాజిటరీ రిసిప్ట్(జీడీఆర్) కేసు సంచలనం సృష్టించింది. రూ.370 కోట్ల మేర కుంభకోణం జరిగినట్లు అప్పట్లో దర్యాప్తు అధికారులు - మిగతా3లో

అభ్యర్థిత్వం అనూహ్యం

-మొదటిపేజీ తరువాయి

తెర పడింది. అయితే అనూహ్యంగా పార్టీ ఫైర్ బ్రాండ్ విజయశాంతి పేరు తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, సుదీర్ఘకాలంగా డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న కేతావత్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీ విజయశాంతి పేర్లను పార్టీ అధిష్ఠానం ఆదివారం ప్రకటించింది. ఒక సీటును మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. ఈ మేరకు ప్రతిపాదనను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ (సంస్థాగత వ్యవహారాలు) ప్రకటించారు. మొత్తం ఐదు సీట్లకు ఎన్నికలు జరుగుతుండగా.. పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి నాలుగు సీట్లలో పోటీ చేస్తున్న కాంగ్రెస్.. అందులో ఒకటి మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మిత్రధర్మంలో భాగంగా ఆ పార్టీకి ఇచ్చింది. మొత్తంగా ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పెద్దపీట వేసింది. ఎస్సీ, ఎస్టీతోపాటు ఒక మహిళకు అవకాశం కల్పించింది.

రేవంత్‌రెడ్డి సూచించిన అభ్యర్థులకే!

ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా తనకు కావాల్సిన వారికి దక్కించుకున్నారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. అద్దంకి దయాకర్‌కు సరైన సమయంలో అవకాశం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రస్తావించారు. మిగిలిన ఇద్దరు అభ్యర్థుల ఎంపికలోనూ ఆయన వ్యూహాత్మకంగా వ్యవహరించారని అంటున్నారు. వాస్తవానికి అభ్యర్థుల పేర్లను ఖరారు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఉదయమే ఢిల్లీకి రావాల్సి ఉంది. అయితే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అందుబాటులో లేకపోవడంతో చివరి నిమిషంలో వారు పర్యటనను రద్దు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లోనే అభ్యర్థుల ఖరారుకు సంబంధించిన చర్చలు జరిపారు. ఆ మేరకే కాంగ్రెస్ అధిష్ఠానం అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. కాగా, ఈ దఫా ఓసీలకు సీటు కేటాయించొద్దని అధిష్ఠానం నిర్ణయించడంతో ఎమ్మెల్సీ సీటుపై ఆశలు పెట్టుకున్న ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి నిరాశ ఎదురైంది. ఆయనతోపాటు రేసులో చివరిదాకా ఉన్న ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీనియర్ నేత జెట్టి కుసుమ్‌కుమార్‌కూ నిరాశే ఎదురైంది.

ఎట్టకేలకు అద్దంకికి అవకాశం..

తెలంగాణ ఏర్పడిన దగ్గర్నుంచీ అద్దంకి దయాకర్‌ను ఊరిస్తూ వస్తున్న చట్టసభల్లో ప్రాతినిధ్యం.. ఎట్టకేలకు దక్కనుంది. 2014, 2018 ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన దయాకర్ స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2023 ఎన్నికల్లో తుంగతుర్తి సీటును మందుల సామేలుకు ఇచ్చిన అధిష్ఠానం.. అద్దంకికి ఎమ్మెల్సీ సీటు హామీ ఇచ్చింది. ఇటీవల రెండు సీట్లకు జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక సీటును తొలుత అద్దంకి దయాకర్‌కు ఖరారు చేసినా.. చివరి క్షణంలో అభ్యర్థిని మార్చేసింది. ఈ దఫా ఎమ్మెల్సీ సీటు కూడా చివరి వరకూ సస్పెన్స్‌గానే నిలిచింది. ఈ సీటును మాదిగకు కేటాయించాలా.. లేక మాలకు కేటాయించాలా అన్న తర్జన భర్జన నడిచింది. ఒక దశలో మాదిగ, మాల సామాజిక వర్గాలకు చెరోటి కేటాయించాలన్న అంశంపైనా చర్చ నడిచింది. అయితే సీపీఐకి ఒక సీటు కేటాయించడంతో రెండు సామాజిక వర్గాల్లో ఒక దానికే సీటు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌తో ఫోన్ ద్వారా చర్చలు జరిపిన అధిష్ఠానం.. చివరికి అద్దంకి దయాకర్ పేరును ఖరారు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతోనే అద్దంకి దయాకర్‌కు అభ్యర్థిత్వం లభించిందని పార్టీ వర్గాలు తెలిపాయి. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్‌కు చెందిన దయాకర్ అద్దంకి దయాకర్ విద్యార్థి దశ నుంచి సామాజిక, విద్యార్థి ఉద్యమాల్లో పనిచేశారు.

అధిష్ఠానం ఆశీర్వాదంతో విజయశాంతి

తొలుత వెండితెరపై, ఆ తర్వాత రాజకీయాల్లోనూ ఫైర్‌బ్రాండ్‌గా కొనసాగిన విజయశాంతి.. ఎమ్మెల్సీ అభ్యర్థుల రేసులో అనూహ్యంగా తెరపైకి వచ్చారు. ఇటీవల ఆమె అధిష్ఠానం పెద్దలను కలిసి తన అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు చేసుకున్నారు. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సోనియా సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెసలో చేరిన విజయశాంతి.. 2018 ఎన్నికల తర్వాత బీజేపీలో చేరారు. అయితే ఆ పార్టీ రాజకీయాల్లో ఇమడలేక 2023 ఎన్నికలకు ముందు తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఆమె చేరే సమయంలోనే పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ సీటు ఇస్తామని అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే హామీ ఇచ్చారు. అధిష్ఠానాన్ని కలిసిన విజయశాంతి ఈ హామీని గుర్తు చేసినట్లు చెబుతున్నారు. ఈ హామీతోపాటు బీసీ మహిళ కోటాలో విజయశాంతిని అభ్యర్థిగా అధిష్ఠానం నిర్ణయించింది. అయితే విజయశాంతిని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆమె మూలాలకు సంబంధించిన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. 2005లో తల్లి తెలంగాణపార్టీని స్థాపించిన తొలిరోజుల్లో తన స్వస్థలం ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలం రామన్నగూడెంగా విజయశాంతి ప్రకటించుకున్న సంగతి తెలిసిందే.

సామాన్య కార్యకర్త నుంచి ఎదిగిన శంకర్‌నాయక్

కేతావత్ శంకర్‌నాయక్.. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఎదిగారు. ప్రస్తుతం నల్లగొండ డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న శంకర్‌నాయక్.. జానారెడ్డికి సన్నిహితుడిగా పేరుంది. దీనికితోడు టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి ఉత్తమ్ ఆయన అభ్యర్థిత్వానికి మద్దతుగా నిలిచారు. పార్టీలో 30ఏళ్ల సీనియారిటీ ఉండడం కూడా శంకర్‌నాయక్‌కు కలిసొచ్చింది. శంకర్‌నాయక్ స్వగ్రామం నల్లగొండ జిల్లాలోని కేతావత్ తండా. డిగ్రీ పూర్తయిన వెంటనే యూత్ కాంగ్రెస్ నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించిన శంకర్‌నాయక్ రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించేవారు. సొంత మండలం దామరచర్ల నుంచి రెండు పర్యాయాలు జడ్పీటీసీ సభ్యుడిగా, ఒక పర్యాయం ఎంపీపీగా ఎన్నికయ్యారు. మూడు పర్యాయాలూ జనరల్ స్థానం నుంచే శంకర్‌నాయక్ ఎన్నికవడం రాజకీయాల్లో అప్పట్లో విశేషంగా చెప్పుకొన్నారు.

నామినేషన్ల దాఖలుకు నేడే ఆఖరు

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు తుది గడువు సోమవారం సాయంత్రం 3 గంటలకు ముగియనుంది. ఇప్పటి దాకా 4 నామినేషన్లు దాఖలైనా.. వాటిలో ఒక్కటీ ప్రధాన పార్టీల నుంచి వచ్చినవి కావు. ఈ నామినేషన్లు.. స్క్రూటినీలో తిరస్కరణకు గురికావడం లాంఛనమే. కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. బీజేపీ, ఎంఐఎం పార్టీలకు అభ్యర్థులను ప్రతిపాదించేంత సంఖ్యలో ఎమ్మెల్యేలు లేకపోవడంతో ఆ రెండు పార్టీలూ తమ అభ్యర్థులను రంగంలోకి దింపే అవకాశం లేదు. బీజేపీ.. తన అభ్యర్థిని రంగంలోకి దించాలంటే బీఆర్ఎస్ మద్దతు తీసుకోవడం ఒక్కటే మార్గం. అయితే బీఆర్ఎస్ మద్దతు తీసుకునే ప్రసక్తే ఉండదంటూ బీజేపీ నేతలు చెబుతున్నారు. ఇక ఎంఐఎం తన అభ్యర్థిని రంగంలోకి దింపాలంటే.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ఒకరి మద్దతు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ముగ్గురు అభ్యర్థులను ప్రకటించి, ఒకటి సీపీఐకి ఇవ్వడంతో ఆ పార్టీ మద్దతు ఎంఐఎంకు లభించే అవకాశం లేదు.

ఈడీ వర్సెస్ సీఐడీ!

-మొదటిపేజీ తరువాయి

తేల్చారు. కేసును సీఐడీకి బదిలీ చేశారు. ఇప్పుడు ఈ కేసు హాట్‌టాపిక్‌గా మారింది. సరైన ఆధారాల్లేనందున కేసును మూసివేయాలంటూ సీఐడీలోని ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) గత ఏడాది అక్టోబరులో ఎల్‌బీనగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విషయం తెలుసుకున్న ఈడీ.. సీఐడీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 5న ప్రొటెస్ట్ పిటిషన్ వేసింది. "ఈ కేసులో ఇప్పటికే రెండు దఫాలుగా రూ.124.79 కోట్ల ఆస్తులను అటాచ్ చేశాం. అవన్నీ నిందితులైన కంపెనీ ప్రమోటర్లు, ఫండ్ రెగ్యులేటర్లు అయిన లండన్‌కు చెందిన అరుణ్ పంచారియా, దుబాయ్‌కి చెందిన సంజయ్ అగర్వాల్, హైదరాబాద్‌లో నివసించే ఎం.శ్రీనివాసరెడ్డి, ఎం.మల్లారెడ్డిలకు సంబంధించిన ఆస్తులు" అని ప్రొటెస్ట్ పిటిషన్‌లో ఈడీ స్పష్టం చేసింది. నేరాన్ని నిరూపించేందుకు అన్ని ఆధారాలున్నాయని, నిందితులు ఫెమా నిబంధనలను ఉల్లంఘించారనడానికి సాక్ష్యాలున్నాయని పేర్కొంది. ఇప్పటికే ఫార్ములా ఇండియా ఆర్థిక సలహాదారు అగర్వాల్‌తోపాటు.. పలువురిని అరెస్టు చేసినట్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చింది. హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సైతం సీఐడీ నిర్ణయంపై విస్మయం వ్యక్తం చేస్తూ, ఫార్ములా ఇండియా కేసును మళ్లీ తెరవాలని.. తెలంగాణ డీజీపీకి లేఖ రాశారు. ఒక కేసుకు సంబంధించి ఇన్ని విభాగాల మధ్య విభేదాలుండడం ఇదే మొదటిసారి..!

నిర్ధారించిన సెబీ

సెబీ కూడా 2020 జూలై 15న జీడీఆర్ మోసాన్ని నిర్ధారిస్తూ తీర్పునిచ్చింది. ఫార్ములా ఇండియా సంస్థ మోసపూరితంగా వ్యవహరించి జీడీఆర్‌లను దుర్వినియోగం చేసిందనీ, షెల్ కంపెనీల ద్వారా లావాదేవీలు జరిగాయని స్పష్టం చేసింది. ఈ కంపెనీని స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాల్లో పాల్గొనకుండా నిషేధించింది. కంపెనీ డైరక్టర్లు ఎం.శ్రీనివాసరెడ్డి, అరుణ్ పచారియా, వింటేజ్ ఎఫ్‌జడ్‌ఈలు ఈ మోసానికి పాల్పడ్డారని తేల్చిచెబుతూ.. ఫార్ములా ఇండియాకు రూ.50 లక్షల జరిమానా విధించింది. సెబీ తన తీర్పులో పలు అంశాలను ప్రముఖంగా ఎత్తిచూపింది. అవి.. ఫార్ములా ఇండియా లిమిటెడ్(ఎఫఐఎల్) కంపెనీ 71.91 మిలియన్ విలువైన(నాటి విలువ రూ.370కోట్లు) 51 లక్షల జీడీఆర్‌లను జారీ చేసింది. వీటిని వింటేజ్ ఎఫ్‌జడ్‌ఈ సబ్‌స్క్రైబ్ చేసింది. ఆ తర్వాత వింటేజ్ కంపెనీ దుబాయ్‌లోని ఈరం బ్యాంకులో జీడీఆర్‌లను తనఖా పెట్టి.. రుణం తీసుకుంది. అరుణ్ పచారియా ఈ రుణాన్ని వివిధ కంపెనీలకు మళ్లించారు. దీనివల్ల ఎఫ్ఐఎల్, దాని షేర్ హోల్డర్లకు 72.20 మిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లింది. ఈ మోసపూరిత వ్యవహరంలో కేవలం ఎఫ్ఐఎల్, వింటేజ్ మాత్రమే కాకుండా ప్రాస్పెక్ట్ కాపిటల్ లిమిటెడ్, జాన్ బెహర్, నితీశ్ బన్‌గెరా, ఫండ్ మేనేజర్లు అయిన ఇండియా ఫోకస్ కార్డినల్ ఫండ్, హై బ్లూస్కై ఎమర్జింగ్ మార్కెట్ ఫండ్ పాత్ర ఉంది.

బీసీలు ఎదగకుండా అడ్డుకునే కుట్ర

హైదరాబాద్

రాష్ట్రంలో బీసీలు ఎదగకుండా, వారికి 42 శాతం రిజర్వేషన్లు అందకుండా ఆదిలోనే అడ్డుకునే కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని.. దానితో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని పేర్కొన్నారు. దీనివల్లే ఆయా పార్టీల నేతలు లేనిపోని అపోహలు సృష్టించి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని.. ఆ ప్రయత్నాలను బీసీలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన 17వ అఖిల భారత పద్మశాలి, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే.. "రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సమాచారమంతా అధికారికంగా సేకరించినదే. ఇంటి యజమాని ధ్రువీకరణ కూడా తీసుకున్నాం. ఈ సర్వేలో బీసీల జనాభా 56.33 శాతం ఉన్నట్లు తేలింది. గతంలో కేసీఆర్ హయాంలో చేసిన సర్వేలో బీసీల జనాభా 51శాతమే లెక్కించారు. ఇప్పుడు 5.33 శాతం పెరిగింది. కేసీఆర్ సర్వేలో అగ్రకులాల జనాభా శాతం 21శాతం ఉన్నట్టు చెబితే.. మా సర్వేలో 15.28 శాతమేనని తేలింది. ప్రతి కోణంలో సర్వే చేసి గణాంకాలను క్రోడీకరించాం. అసెంబ్లీలో బిల్లు పెడతాం..: బీసీలకు ఇచ్చిన హామీలో భాగంగా 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. త్వరలో అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తాం. పార్లమెంటులో ఈ బిల్లుకు ఆమోదం తెలిపిన వెంటనే రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి ఇవ్వడమంటే మోదీ మెడ మీద కత్తిపెట్టినట్టే. కచ్చితంగా మన డిమాండ్‌ను ఆమోదించాల్సిందే.

బీసీల కోసం ప్రజాప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కొందరు ఓర్వలేకపోతున్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వస్తే వారు ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతారనే భయం ప్రతిపక్ష పార్టీలకు పట్టుకుంది. బీసీలు ఎదిగితే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అందుకే బీసీ రిజర్వేషన్లను ఆ రెండు పార్టీలు ఆదిలోనే అడ్డుకునే కుట్ర చేస్తున్నాయి. ఈ పరిస్థితులను బీసీలంతా గుర్తించాలి.

నన్ను ఎప్పుడైనా కలవచ్చు..: తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతోనే ముఖ్యమంత్రి అయ్యాను. ప్రజల సమస్యలు పరిష్కరించడమే నా కర్తవ్యం. అందుకోసం

24గంటలు పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాను. గత ప్రభుత్వంలో సీఎంను కలవాలంటే పెద్ద సాహసంగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎప్పుడైనా నన్ను కలవచ్చు. మీ సమస్యలు నా దృష్టికి తీసుకువచ్చి.. వాటిని పరిష్కరింపజేసుకునే బాధ్యత మీదే. తెలంగాణ సాధన కోసం పోరాడిన పద్మశాలి ముద్దు బిడ్డ కొండాలక్ష్మణ్ బాపూజీని పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రజాప్రభుత్వం ఏర్పాటు కాగానే.. కేంద్రంతో మాట్లాడి 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేశాం. దానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నాం. ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి కూడా కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెడతాం. టైగర్ నరేంద్రకు యూపీఏ ప్రభుత్వం కేంద్ర మంత్రి పదవి ఇస్తే... ధృతరాష్ట్రుడి కౌగిలి మాదిరిగా కేసీఆర్ ఆయనను ఖతం చేశారు. కులవృత్తిపై ఆధారపడిన పద్మశాలీలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నాం. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలను మహిళలు కట్టుకోలేదు. అవి పొలాల దగ్గర కట్టడానికే పనికి వచ్చాయి. అందుకే అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరల పంపిణీ ఆపివేశాం. మహిళా సంఘాల్లోని వారికి మంచి చీరలు ఇవ్వాలని నిర్ణయించాం. రూ.600 కోట్ల విలువైన 1.30 కోట్ల చీరల ఆర్డర్లను నేతన్నలకు ఇస్తున్నాం. తెలంగాణ పద్మశాలీలు ఇతర రాష్ట్రాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. రూ.కోటితో షోలాపూర్‌లో పద్మశాలీల ఆత్మగౌరవాన్ని నిలిపేలా మార్కండేయ భవనం నిర్మించేందుకు సహకరిస్తాం.." అని సీఎం రేవంత్ వెల్లడించారు.

చేనేత కార్మికులకు రుణమాఫీ అమలు చేస్తున్నాం: మంత్రి తుమ్మల

రాష్ట్రంలో చేనేత కార్మికులకు రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ బడ్జెట్‌లోనే వారి రుణాలను మాఫీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజల కష్టాలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. పద్మశాలీలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసేందుకు వినూత్న పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు.

మగ్గంపై చీర నేసిన సీఎం

సీఎం రేవంత్ తొలుత ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులు అర్పించారు. అక్కడ సిద్ధం చేసిన చేనేత మగ్గంపై చీర నేశారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ కేడర్ సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, వరంగల్ మేయర్ గుండు సుధా రాణి, అఖిలభారత పద్మశాలి సంఘం, తెలంగాణ పద్మశాలి సంఘం ప్రతినిధులు అంబటి శ్రీనివాస్, మురళీధర్, గడ్డం జగన్నా థం, కన్నెగట్ల స్వామి, టీపీసీసీ చేనేత విభాగం అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్, మచ్చ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మనిషి పుట్టుక, మనుగడకు
మహిళే ఆధారం : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి మార్చి 09: నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి రాజీవ్ గాంధీ నగర్ లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, సినీనటి శివ పార్వతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ మనిషి పుట్టుక, మనుగడకు మహిళే ఆధారమని అన్నారు. ఇంటిలోని మహిళ చదువుకుంటే కుటుంబంతో పాటు తర్వాతి తరాలు ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. మహిళలను ప్రోత్సహించి – నట్లయితే సమాజంలో వారికంటూ ప్రత్యేక స్థానం సాధించడంతో పాటు ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారన్నారు. నిష్కల్మషమైన ప్రజలు తెలంగాణ ప్రజలు : సినీ నటి శివ పార్వతి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో మరో ముఖ్యఅతిథిగా హాజరైన సినీ నటి శివపార్వతి మాట్లాడుతూ.... నేను పుట్టి పెరిగిందంతా తెనాలి అయినా, 40 ఏళ్ల క్రితం హైదరాబాద్ నగరానికి వచ్చి స్థిరపడ్డానని... తెలంగాణ ప్రజలు మనసులో ఒకటి పెట్టుకొని, బయటికి ఒకలా మాట్లాడే వారు కారని, తెలంగాణ ప్రజలంతా నిష్కల్మషమైన మనసు కలిగినవారన్నారు

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు గాజుల సుజాత, ప్రణయ ధనరాజ్ యాదవ్, బాలాజీ నాయక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీష్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, నాయకులు బొబ్బ శ్రీనివాస్, బస్తీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి యువతి వివాహానికి పుస్తె
మెట్టెలు వితరణ - ఎన్నారై రాధారపు సత్యం ఔదార్యం

షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట మండల ప్రతినిధి మార్చి 09:
పేదింటి యువతి వివాహానికి పుస్తె మట్టలు వితరణ చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు ఎన్ఆర్ఐ రాదారపు సత్యం ఎల్లారెడ్డి పేట మండలం బండ లింగంపల్లి గ్రామానికి చెందిన నిరుపేద శివగౌని నర్సాగౌడ్ దేవవ్వ కూతురు వివాహం సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ బాలరాజు నర్సాగౌడ్ ఆధ్వర్యంలో లోకుర్తి తిరుపతి ద్వారా రాదారపు సత్యం పుస్తే మట్టెలను కానుకగా యువతి కుటుంబానికి అందజేశారు.
ఈ సందర్భంగా రాధారపు సత్యం కు యువతి తల్లి దండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సాయిగౌడ్ బైరగోని అంజాగౌడ్ తిరుపతిగౌడ్, భూపతిగౌడ్, రెడ్డి సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ట్రాక్టర్ యూనియన్ ప్రెసిడెంట్ మరుపు సంజీవరెడ్డి, గోల్డ్ స్మీత్ శ్రీనివాస్ చారి, బాలాజీ, టీచర్ బొడ్డు దేవయ్య, మాజీ వార్డ్ మెంబెర్ బొడ్డు శంకర్, అబ్దుల్ హుస్సేన్, గూడూరి మనోహర్, వెంగళం శ్రీధర్, అజయ్ గౌడ్ గ్రామస్థులు పాల్గొన్నారు.

నిజాంపేట్ మున్సిపల్
సాయి కృష్ణజ కాలనీలో సీసీ రోడ్ల శంకుస్థాపన

షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి మార్చి 09: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయి కృష్ణజ కాలనీలో సీసీ రోడ్లు లేకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని గత నెల సంప్రదించగా వారి సమస్యలపై స్పందించి. ఎన్ఎంసి ఫండ్స్ ద్వారా సిసి రోడ్డు నిర్మాణానికి 25,00,000 లక్షల రూపాయలు మంజూరు చేయించి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మరియు వారితో పాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి లు పాల్గొన్నారు. అనంతరం కాలనీ మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కరించాలని కాలనీ వారు విన్నవించారు. సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ప్రజలందరికీ ప్రతిరోజు అందుబాటులో ఉంటానని తెలిపారు . కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. . ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె జనార్దన్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, జీవన్ రెడ్డి, జై సింహ రెడ్డి, నాగేశ్వర్ రావు, విజయ్ తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు

ఘనంగా మాజీ స్పెషల్
చీఫ్ సెక్రటరీ టి గోపాల్ రావు జన్మదిన వేడుకలు

షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి మార్చి 09: మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఐఏఎస్ అధికారి టి గోపాలరావు 75 వ జన్మదినాన్ని పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఎస్సీ గర్ల్స్ హాస్టల్ లో దీన శరణ్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కేక్ కట్ చేసి విద్యార్థులకు మిఠాయి పంపిణీ చేశారు. అనంతరం సంస్థ చైర్మన్ చింతల సాయిబాబా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు ఎస్సీల కోసం ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి విద్యార్థులను ఐఏఎస్ ఐపీఎస్ లు సాధించేందుకు కృషి చేసిన మొట్ట మొదటి వ్యక్తి అని కొనియాడారు. దళితుల ఆశాజ్యోతి ఇప్పటికీ ఐఏఎస్ ఐపీఎస్ లకు సహాయ సహకారాలు అందజేస్తున్న గొప్ప వ్యక్తి విద్యావేత్త గోపాల్ రావు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సహాయ సహకారాలు అందజేయడం జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా విషయ నిపుణులు గంగదారి శ్రావణ్ కుమార్,శ్రీరాముల లక్ష్మణ్,ఎండి.మాదర్, కే కృష్ణ స్థానిక వార్డెన్ ఆర్.శైలజ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతోనే
మంచినీటి పైపులైన్ పనులు ప్రారంభం

షణ్ముఖ వెలుగు పెబ్బేరు మండల ప్రతినిధి మార్చి 09: వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి సహకారంతో పెబ్బేరు మండలం కంచి రావు పల్లి గ్రామంలో మంచినీటి కష్టాలు తీర్చడానికి పైపులైన్ పనులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బస్టాండ్ నుంచి జమ్ములమ్మ కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన కొత్త ఇళ్లకు పైపులైన్,అలాగే గ్రామ పంచాయితీ దగ్గర నుంచి బండ మీది ఇళ్లకు కొత్త పైపులైన్ చేసి తాగునీరు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంధం,రాముడు,పుల్లూరు జైపాల్ రెడ్డి,శ్యామ్ సుందర్ గౌడ్,భాస్కర్ రెడ్డి,గంధం నాగరాజు, పెద్ద మన్నెం, వెంకటేష్,రాజేష్, సాయి ప్రసాద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాదు బహిరంగ
సభకు బయలు దేరిన పద్మశాలీలు

షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు మండల ప్రతినిధి మార్చి 09 : అడ్డ గూడూరు పద్మశాలి సంఘం అధ్యక్షులు కాటబత్తిని గంగేశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదులో జరిగే పద్మశాలి బహిరంగ సభకు బయలుదేరిన అడ్డ గూడూరు మండల పద్మశాలి నాయకులు. ఈ సందర్భంగా పద్మశాలి అడ్డ గూడూరు సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ.. పద్మశాలీల హక్కుల కోసం ఏకతాటిపై వచ్చి పోరాటం చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్క పద్మ శాలి బిడ్డ పై ఉందన్నారు. చట్టసభలో పద్మశాలి గొంతు వినిపించి నప్పుడే సమాజంలో పద్మశాలి లకు గుర్తింపు సముచిత స్థానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుండి భారీ ఎత్తున పద్మశాలీలు బయలుదేరారు ఈ కార్యక్రమంలో సత్యం, భాస్కర్, సురేందర్, శ్రీను, శోభన్, సాగర్, రవి తదితరులు పాల్గొన్నారు

గుండెపోటుతో
రిటైర్డు ఉద్యోగి మైసయ్య మృతి
కుటుంబ సభ్యులను పరామర్శించిన జిల్లా బిఆర్ ఎస్

అధ్యక్షుడు తోట ఆగయ్య

షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట మండల ప్రతినిధి మార్చి 09
ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో నాల్గవ తరగతి ఉద్యోగిగా పని చేసి రిటైర్డు అయినా ఎల్లారెడ్డి పేట లోనే ఉంటున్న పుల్లూరి మైసయ్య (69) గుండెపోటు తో మృతి చెందాడు. కొన్నేళ్ళ క్రితం మైసయ్య బైకు ప్రమాదానికి గురై ఒక కాలు కోల్పోగా ఇంట్లోనే వుంటున్న అతడు మానసికంగా ఆందోళనతో జీవనం గడుపుతూ గుండెపోటుకు గురై మృతి చెందినట్లు సమాచారం మృతుడు మైసయ్య మృత దేహాన్ని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, మాజీ జడ్పిటిసి చీటీ లక్ష్మణ్ రావు, సింగిల్ విండో చైర్మన్, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, తిమ్మాపూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి లు సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ గా దాసోజు శ్రావణ్ !

షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో రాము అల్లాడి హైదరాబాదు మార్చి 09: కేసీఆర్ ఒక్క సీటు కే పోటీ చేయాలని నిర్ణయిస్తే.. ఇప్పటికే పార్టీ అభ్యర్థి పైన నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టం అవుతోంది. ప్రధానంగా దాసోజు శ్రావణ్ కు ఖాయంగా కనిపిస్తోంది. కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో గవర్నర్ కోటాలో శ్రావణ్ కు ఎమ్మెల్సీ సీటు పైన నిర్ణయం తీసుకున్నారు. ఆ తరువాత న్యాయ పరమైన అంశాలతో అవకాశం దక్కలేదు. ఇప్పుడు బీసీ కే సీటు ఇవ్వాలని గులాబీ బాస్ నిర్ణయించారు. దీంతో.. శ్రావణ్ తో పాటుగా జోగు రామన్న, బిక్షమయ్య గౌడ్ సైతం సీటు ఆశిస్తున్నారు. ప్రస్తుతం పదవీ కాలం ముగియనున్న సత్యవతి రాథోడ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్సీ వర్గం నుంచి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్, రసమయి బాల కిషన్ పేర్లు చర్చకు రాగా దీంతో, పోటీ .. అభ్యర్థుల పై కేసీఆర్ నిర్ణయం రాజకీయంగా ఉత్కంఠ పెంచుతోంది.

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 10 వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 2025-26 వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. ఈ సమయంలోనే.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు అటు సీఎం రేవంత్.. ఇటు కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. నాలుగు స్థానాలు కాంగ్రెస్ – మిత్ర పక్షాలకు దక్కే అవకాశం ఉంది. బిఆర్ఎస్ కు ఒక సీటు దక్కనుంది. దీంతో.. కేసీఆర్ కొత్త వ్యూహం అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణలో అయిదు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ సీట్లకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయింది. కాంగ్రెస్ కు నాలుగు, బిఆర్ఎస్ కు ఒక సీటు దక్కనుంది. కాగా, కాంగ్రెస్ నుంచి ఒకటి సీపీఐ కు ఖరారు అయింది. ఎంఐఎం కు మరో సీటు దక్కుతుందా లేదా అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఇదే సమయంలో కాంగ్రెస్ నుంచి మూడు స్థానాల పైన కసరత్తు చేస్తున్నారు. సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యత ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. అయితే, బిఆర్ఎస్ కు ఒక స్థానం దక్కటం ఖాయంగా కనిపిస్తోంది. బిఆర్ఎస్ ఇద్దరు అభ్యర్థులను బరిలో నిలిపే అవకాశం పైన చర్చ

చేస్తున్నట్లు సమాచారం.

అసెంబ్లీలో బిఆర్ఎస్ కు 39 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఉంది. తరువాత చోటు చేసుకున్న పరిణామాలతో 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కు దగ్గరయ్యారు. వీరి పైన అనర్హత వేటు వేయాలని కోరుతూ బిఆర్ఎస్ కోర్టుకు వెళ్లింది. సుప్రీంకోర్టు తాజాగా ఈ కేసులో నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22 లోగా నోటీసుల పైన సమాధానం ఇవ్వాలని సూచించింది. ఇదే సమయంలో కేసీఆర్ కొత్త స్కెచ్ సిద్ధం చేస్తున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల పైన ఒత్తిడి పెంచే విధంగా రెండు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు గులాబీ పార్టీ నేతల సమాచారం. సుప్రీంలో వీరి కేసు కీలక దశకు చేరిన సమయంలో కేసీఆర్ నిర్ణయం ఆసక్తికరంగా మారుతోంది.

ప్రారంభానికి నోచుకోని మాచాపూర్ గ్రామ పంచాయతీ భవనం



షణ్ముఖ వెలుగు మేడిపల్లి మండలం ప్రతినిధి మార్చి 09: జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గ మేడిపల్లి మండలంలోని మాచాపూర్ గ్రామంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు అయి పనులు ప్రారంభం కాగా రెండు నెలల క్రితమే పనులు పూర్తయ్యాయని అయినా గ్రామ పంచాయతీ భవనం ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. వేములవాడ ఎమ్మెల్యే విప్ అది శ్రీనివాస్ చొరవ తిసుకొని మాచాపూర్ నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు

వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా అంకరి కుమార్

మంథని వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం మంథని పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా అంకరి కుమార్, ప్రధాన కార్యదర్శి గా నాంపెల్లి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అంకరి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో గ్రౌండ్ లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. గౌరవ అధ్యక్షులుగా రావికంటి మనోహర్, కొమురోజు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఇసంపల్లి కొమురయ్య, వేల్పుల గట్టయ్య, సహాయ కార్యదర్శులుగా కుక్కడపు రామ్మూర్తి, చిట్టిమెల్ల సంతోష్, కోశాధికారిగా చిలువేరి సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గంధం ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సహాయ కార్యదర్శిగా విష్ణు భక్తుల రఘు, తాటి సమ్మయ్య గౌడ్, క్రీడా కార్యదర్శిగా మూడెత్తుల సమ్మయ్య, సాంస్కృతిక కార్యదర్శిగా లక్కాకుల నాగరాజు, లీగల్ అడ్వైజర్ గా అడ్వకేట్ రాజేందర్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లారీ బ్యాటరీల దొంగల అరెస్ట్...

జల్సాలకు అలవాటు పడి దొంగతనం కేసులో జైలు జీవితం గడిపి తిరిగి బయటకు వచ్చినా మళ్లీ దొంగతనం చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు ఇద్దరు దొంగలు...వివరాల్లోకి వెళ్తే సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శాస్త్రి నగర్ లో ఈ నెల 3న ఆగి ఉన్న లారీలకు సంబంధించిన 22 బ్యాటరీలను దొంగతనం చేసిన ఇద్దరు దొంగలను సుల్తానాబాద్ పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు దొంగల అరెస్ట్‌పై ఎస్సై శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా సిసి నస్పూర్ గాంధీనగర్ కు చెందిన మోటం శ్రీను, అతని సమీప బంధువు తూర్పాటి మహేష్‌లను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. శ్రీను గ్రామంలో ఖాళీ బీరు సీసాలు ఏరుకొని విక్రయిస్తూ జీవించేవాడని, బీరు సీసాలు విక్రయించగా వచ్చిన డబ్బులు తన అవసరాలకు జల్సా లకు సరిపోకపోవడంతో దొంగతనాలు చేసి సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో 2019 సంవత్సరంలో వెల్గటూర్ మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో ఓ మొబైల్ షాప్ లో షెటర్ తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడగా వెల్గటూర్ పోలీసులు అతన్నిఅరెస్టు చేసి జైలుకు పంపించారని తెలిపారు. తిరిగి బెయిల్ పై వచ్చి మళ్లీ బీరు సీసాలు వ్యాపారం చేస్తూ 2021 సంవత్సరంలో ఇందారం శివారులో జైపూర్ మండలంలో ఓ హార్డ్వేర్ షాపులో సుమారు ఐదు టన్నుల ఇనుము, సీసీ టీవీ మానిటర్ డివిఆర్ ను దొంగలించగా జైపూర్ పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు తరలించారని తెలిపారు. తిరిగి జైలు నుండి వచ్చిన శీను తన సమీప బంధువు తూర్పాటి మహేష్‌తో కలిసి ఈనెల 03 న మారుతి జెన్ కారులో కరీంనగర్ కు వెళ్లి తమ పనులు ముగించుకొని తిరిగి రాత్రి మంచిర్యాలకు వెళుతుండగా మార్గమధ్యలో శాస్త్రి నగర్ హనుమాన్ టెంపుల్ వద్ద లారీలు నిలిపి ఉండడం చూసి 22 లారీల బ్యాటరీలను చోరీకి పాల్పడి తమ కారులో నస్పూర్ కు తరలించి భద్రపరచారని తెలిపారు. తిరిగి ఆదివారం వాటిని విక్రయించేందుకు కరీంనగర్ తరలిస్తుండగా సుల్తానాబాద్ చెరువు కట్ట సమీపాన వాహనాల తనిఖీ నిర్వహించగా అనుమానస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా లారీలకు సంబంధించిన 22 బ్యాటరీలు కారులో కనిపించాయని, దీంతో నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించారని ఆయన తెలిపారు.

సోషల్ మీడియాలో జాతీయవాద ప్రభావం కీలకం

సోషల్ మీడియా సంగమం ప్రోగ్రాం లో వక్తలు నవత దేశ్ పాండే, ప్రదీప్ కుమార్

షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో రాము అల్లాడి హైదరాబాదు మార్చి 09: సోషల్ మీడియాలో జాతీయ వాద ప్రభావం కీలకంగా మారిందని ప్రముఖ యూ ట్యూబర్, జర్నలిస్ట్ నవత దేశ్ పాండే అన్నారు. సమాచార భారతి కల్చరల్ అసోసియేషన్ కరినగర్ శాఖ ఆధ్వర్యంలో సోషల్ మీడియా సంగమం ప్రోగ్రాం ఆదివారం స్థానిక పాండురంగ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో 'భారతీయ సమాజంలో స్త్రీ" అనే అంశం పై జర్నలిస్టు నవత మాట్లాడుతూ ఆడవారిని గౌరవించే సుసాంప్రదాయం కేవలం హిందూ ధర్మంలోనే ఉందని,భారతీయ మహిళలు ప్రపంచంలోని అన్ని సాంప్రదాయాలలోని మహిళల కన్నా ఆదర్శవంతమైనవారని చెప్పారు. ప్రస్తుతం భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల మీద సామాజిక మాధ్యమాలలో విష ప్రచారం జరుగుతోందని , దానిని ఎదుర్కోడానికి ప్రతీ మహిళా వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి లాగా శక్తి స్వరూపిణి లా మారి తప్పుడు ప్రచారాల్ని తిప్పి కొట్టాలని,భారతీయ మూలాలను మరువకూడదని తెలిపారు.ఆడవారంటే వంటింటి కుందేల్లు కాదని, వారు విజ్ఞాన గనులని వేదకాలం నుండి నిరూపింపబడుతుందన్నారు. వేదకాలం నుండి మహిళలకు అపారమైన గౌరవం ఉండేదని, మగవాడు ఆచరించే ప్రతి ధర్మ కార్యం లోను సమానమైన స్థానం స్త్రీ కి ఉందన్నారు. దీనివల్ల సాన్నిహిత్యం పెరిగి స్నేహం దృఢమవుతోందని,

అందుకే ఆమెకు అర్ధాంగి అనే పేరు సార్థకమైందని, ఆనాటి ఈ మహోన్నత భావనే ఈ నాటికి స్త్రీలపై ఉత్తమమైన ప్రభావాన్ని చూపించి తన బాధ్యతలను అభ్యుదయ పథంలో ప్రకాశిస్తోందని తెలిపారు. అతి పవిత్రమైన వేదాలలో మంత్రద్రష్టలుగా స్త్రీలు ఉన్నారన్నారు.

"యత్రనార్యస్తుపూజ్యంతే రమంతే తత్ర దేవతా." అన్న మనుస్మృతి ప్రకారం ఎక్కడైతే స్త్రీలు గౌరవింపబడతారో అటువంటి చోట దేవతలు నివసిస్తారన్న వాక్యాన్ని పరమ ప్రమాణంగా స్వీకరించిన ఈ భారతీయ సమాజంలో అనాదిగా స్త్రీలు పూజింప బడుతూ, గౌరవింపబడుతూ, సమాజంలో వారి పాత్రను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. పురాణకాలం నుంచి ఈనాటి వరకు ఎటువంటి సవాలునైనా స్వీకరిస్తూ తను దేనికీ తక్కువ కాదని నిరూపించుకుంటోంది మహిళ. మహిళలో జాతీయ వాద భావజాలం మరింత పెరగాలని ఆశిస్తున్నానని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమాచార భారతి సంయుక్త కార్యదర్శి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ సోషల్ మీడియా యాక్టివిస్టుల కలయికే ఈ సోషల్ మీడియా సంగమం ముఖ్యోద్దేశమని తెలిపారు. నెట్ వర్కింగ్, ట్రెండ్ సెట్టింగ్ లక్ష్యంగా నిత్య శక్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.సోషల్ మీడియా లోని అసత్య కథనాలని సరైన నిజాలతో తిప్పికొట్టడంలో సోషల్ మీడియా కార్యకర్తలు క్రియాశీలంగా ఉండాలని తెలిపారు. అలాగే,సోషల్ మీడియా ద్వారా కంటెంట్ అందించేవారంతా ఆ కంటెంట్ ప్రభావం సమాజంపై ఏ విధంగా ఉంటుందనేది ఆలోచించి, దేశానికి మేలు చేసే రీతిలో ప్రధాన స్రవంతి మీడియాని సైతం ప్రభావితం చేసేలా పని చెయ్యాలని సూచించారు. సమాజం పట్ల బాధ్యతను గుర్తెరిగేలా మీడియాను నడిపించగలగాలన్నారు. ప్రతి ఒక్కరూ మన దేశం, మన సమాజం, మన సంస్కృతి అనే దృష్టికోణం తో శక్తిమంతమైన కథనాలు ఇవ్వాలని తెలియజేస్తూ, సోషల్ మీడియాలో కంటెంట్ క్రియేటర్లు కథనాన్ని ఆసక్తి కలిగించేలా మొదలుపెట్టడం, వీలైనంత క్లుప్తత ను పాటించడం వంటి అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు.

ఇట్టి కార్యక్రమంలో తడిగొప్పుల శంకరయ్య, పురాణం రాము,గీకూరి శ్రీనివాస్ సామల కిరణ్ ,కట్టా వేణుగోపాల్ ,ఎలగందుల సత్యనారాయణ, విమల్ , బాలరాజు తదితరులతో పాటు అనేక మంది కార్యకర్తలు , సోషల్ మీడియా బాధ్యులు పాల్గొన్నారు.

దేవుడిపై రాజకీయం ఏనాడు చేయను

భక్తుల సమక్షంలోనే స్వామివారి కళ్యాణం
ఆలయ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా
ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 09(సిరావెలుగు)

దేవుడిపై ఇక ఏనాడు రాజకీయం చేయనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. ధర్మపురిపట్టణంలోని స్థానిక బ్రాహ్మణ సంఘంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులతో రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ ప్రాంత ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ ఉత్సవాలకు మన రాష్ట్రం నుండే కాకుండ ఇతర రాష్ట్రాల నుండి కూడా స్వామి వారిని దర్శించుకొవడానికి పెద్ద ఎత్తున భక్తులు వస్తారని ఆయన వివరించారు. అయితే ప్రతి ఏటా స్వామి వారి కళ్యాణం దేవలయంలోని శేషప్ప కళావేదికపై నిర్వహించడం జరుగుతుందని దాని వల్ల కేవలం కొంత మంది భక్తులు వీక్షించడానికి అవకాశం ఉందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని ఆలయ అర్చకులు అధికారులు స్వామి వారి కళ్యాణాన్ని దేవాలయంలో కాకుండా బయట నిర్వహించాలని తన దృష్టికి తీసుకురావడంతో మంత్రి కొండ సురేఖకు విషయాన్ని వివరించి స్థానిక బ్రాహ్మణ సంఘం పక్కనే ఉన్న యాగశాల స్థలంలో కళ్యాణం నిర్వహించడానికి అనుమతులు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఫిబ్రవరి 28న దేవాలయ అధికారులు అర్చకులు తనకు వినతి పత్రం ఇవ్వగా మంత్రి కొండ సురేఖ, ఎండోమెంట్ కమిషనర్‌కు లేఖ పంపించగా మార్చి 04 యాదాద్రి దేవాలయ ప్రధాన అర్చకులు, 05న భద్రాద్రి దేవాలయ ప్రధాన అర్చకులు అక్కడి స్వామివార్ల కల్యాణాలు బయట నిర్వహించడం జరుగుతుందని లేఖలు పంపించారని తెలిపారు. అలాగే శృంగేరి పీఠం స్వామి వారు కూడా ఈ కళ్యాణం నిర్వహించే స్థలంలో వేద పాఠశాలను ఏర్పాటు చేయడానికి భూమి పూజ చేశారని, ఈ నెల 05న రాష్ట్ర ప్రభుత్వం నుండి అధికారికంగా స్వామి వారి కళ్యాణాన్ని బయట నిర్వహించడానికి ఉత్తర్వులు వచ్చాయని ఆయన తెలిపారు. 07న ఆలయ అర్చకులు స్వామి కల్యాణం నిర్వహించే స్థలానికి భూమి శుద్ధి పూజ చేశారని ఆయన తెలిపారు. అయితే గత ప్రభుత్వ హయాంలో అప్పటి కమిటీ సభ్యులే స్వామి వారి కళ్యాణం దేవాలయంలో నిర్వహించడం వల్ల అందరూ భక్తులు వీక్షించలేక పోతున్నారని, బయట నిర్వహించాలని ఒక తీర్మానం చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అప్పుటి మంత్రి కొప్పుల ఈశ్వర్ దాన్ని అమలు చేయలేదని, ఇది తాము తొందరపాటులో తీసుకున్న నిర్ణయం కాదని, వేద పండితులు అర్చకులు, బ్రాహ్మణోత్తముల సలహాలు సూచనల మేరకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ నెల 11న సాయంత్రం 6 గంటలకు నిర్వహించే స్వామి వారి కళ్యాణంలో భక్తులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. కళ్యాణం పూర్తైన అనంతరం తన స్వంత ఖర్చులతో కళ్యాణం జరిగిన స్థలం చుట్టూ కంచె వేయించడంతో పాటు కళ్యాణ మండపం ఏర్పాటు చేసి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పెద్ద మొత్తంలో నిధులు తీసుకువచ్చి ఫ్లడ్ వాల్ ఏర్పాటు చేస్తామని, అన్నదాన స్థలం కూడా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సంధర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.